# మనిషి - మనసు



బి.వి.ఎల్.ఎస్.ప్రభాకరరావు

**మా వీధిలో ఆమెను ఎరగని వాళ్ళు ఉండరంటే ఆశ్చర్యం లేదు. లేచినది మొదలు పడుకొనే వరకు ఆమె నోటికి కట్టు ఉండదు. రేడియో దగ్గరగా పెట్టినా ఆమె నోటి ముందు దిగదుడుపే! ఆమె నోటికి జడిసి సాధారణంగా ఆమెతో ఎవరూ మాట్లాడరు. మరి ఆమె మనసు?**

“ఏమే... నాంచారీ... మొద్దు మొహమా... ఇంకా నిద్రేనా! అపుడే తెల్లారి అయిదు గంటలయింది... లేచి ఇల్లూ అదీ ఊడ్చి తగులడు. నే వలా కాలవకు పోయి స్నానం చేసి వస్తాను. వచ్చేటప్పటికి పూజకి సిద్ధం చేసి ఉంచు... తలుపేసుకో... నిద్రమొహమా... నే వెళుతున్నా...” అని పక్కఇంట్లోంచి రవణమ్మబామ్మగారి సుప్రభాతం వినిపించిందే తడవుగా ఉలిక్కిపడి లేచాను.

‘పాపం, నాంచారమ్మ మహా ఇల్లాలు. రవణమ్మగారితో ఎలా వేగుతూందో! పాపం!’ అనుకొని మంచంమీద కూర్చునే ఆవిణ్ణి గురించి ఆలోచించసాగాను.

* * *

అసలిక్కడ రవణమ్మగారి కుటుంబం గురించి చెప్పడం అవసరం. రవణమ్మగారిని మా వీధిలో తెలియని వాళ్ళుండరంటే ఆశ్చర్యపోనవసరం లేదు. వాళ్ళుండేది మా ఇంటి పక్కవాటాలోనే. లేచినది మొదలు పడుకొనే వరకు ఆమె నోటికి కట్టు ఉండదు. మా రేడియో గట్టిగా పెట్టినా ఆవిడ నోటిముందు దిగదుడుపే! ఆమె నోటికి జడిసి సాధారణంగా ఆమెతో ఎవరూ మాట్లాడరు.

చిన్నతనంలోనే రవణమ్మగారి భర్త సుందరరామయ్యగారు చనిపోయారు. పాపం శమించుగాక! ఆయనకూడా ఈవిడ నోటికి వేగలేక ఆత్మహత్య చేసుకొన్నాడని అనుకొంటారు.

భర్త చనిపోయేటప్పటికి రవణమ్మగారికి నాలుగెకరాల మాగాణి మాత్రం మిగిలింది. ఇంక ఆవిడికి నా అన్నవాళ్ళెవరూ లేక ఆడపెత్తనం కొనసాగించింది.

కొన్నాళ్ళకి ఆమెకు ఎవర్నైనా పెంచుకోవాలన్న కోరిక కలిగింది. అనుకొన్నదే తడవుగా అమలాపురం దగ్గర అగ్రహారంనుండి నారాయణను

పది సంవత్సరాల వయసులో తీసుకు వచ్చింది.

నారాయణకు ఎందుచేతో చదువు రాలేదు. అందరు దత్తత పుత్రులులాగే జలసాగా తిరగడం, మంచి బట్టలు వేసుకోవడం, సినిమాలు చూడ్డం వగైరాలు చేసేవాడు వచ్చిన కొత్తల్లో.

కాని రవణమ్మగారు అవేవీ సాగనియ్యలేదు. ఆమె అతని కెప్పుడూ చేతిలో పైసకూడా పెట్టలేదు. అతని కిప్పుడు ముప్ఫయి ఏళ్ళున్నా కాని అతనిని నాలుగేళ్ళ కుర్రాడిని తిట్టినట్టు తిడుతుంది. నారాయణ, పాపం, ఆమె తిట్లకు అలవాటు పడి పోయాడు.

నారాయణకి పాతిక సంవత్సరాల వయస్సులోనే నాంచారమ్మ అనే కులమింటి పిల్లను తెచ్చి పెళ్లి చేసింది. రవణమ్మగారు కోడలు వచ్చినా ఏం మారలేదు. కొడుకుని, కోడల్ని సాధిస్తూంది.

రవణమ్మగారికి మనుమడు, మనమరాలు కలిగారు. ఆమెలో మార్పు లేదు. "దత్తత తెచ్చుకొనికూడా కాల్చుకు తింటూంది" అని లోకులు చెప్పుకొనేవారు. కాని ఆవిడ ఎదుట అనే ధైర్యం ఎవరికీ లేదు.

* * *

"ఏమే, నాంచారీ! అయ్యో నీ మొహం మండ! ఈ తలుపుమీద గుడ్డలు ఏమిటే. . . మడిగా వస్తానని తెలుసుకదా. ఇంకా అలా చూస్తావేం దయ్యంలా. . . ఇవి తీసి తగలెట్టు. . ."

అనే బామ్మగారి మాటలకు ఉలిక్కి పడ్డాను. ఇంక ఇక్కడనుండి బామ్మగారి దైనందిన చర్య ఆలకిస్తూ, నాంచారమ్మా నారాయణులపై జాలి చూపిస్తూ కూర్చోడం తప్పించి నేను చేసేదేమీ లేదు.

బామ్మగారి ఇంట్లోనుండి గంట వినిపించింది. అంటే ఆవిడ పూజ మొదలుపెట్టిందన్న మాట. నా చెవులు మళ్లీ పని చేయడం ప్రారంభించాయి.

"ఓం. . . కేశవాయనమః"

ఓసి నీకు పొయ్యికాలం రానూ!. . . పిల్లాణ్ణి ఇక్కడ వదిలేసి స్నానానికి పోయావా?. . . నారిగా, ఈ వెధవని అలా తీసుకెళ్ళు.

"ఓం నారాయణాయనమః

అయ్యో నీ మొహం తగలెయ్య. . . అగ్గిపెట్టె ఎక్కడ తగలేశావే!. . .

"ఓం గోవిందాయనమః"

ఇంక వినలేక స్నానం చేయడానికి పోయాను.

నేను స్నానం చేసి తిరిగి వచ్చేటప్పటికి ఆవిడ ఇంక వంటప్రయత్నాలు మొదలెడుతుంది. పక్కింట్లోనుండి మాటలు వింటూ బట్టలు వేసుకుంటున్నాను.

"ఈ నారిగాడు వెధవపీనుక్కి కట్టెలు కొనడంకూడా రాదు. తడివి తెచ్చి పడేశాడు. వీడి మొహం మండ! అంటుకోవడం లేదు."

"బియ్యం ఏరడంఅయిందా!అయితే ఇలా తగలెయ్యి. ఆ గిన్నె ...ట్రా. . . అయి నీ యమ్మ కడుపు కాల! ఈ వంకాయ లేమిటే పుచ్చులో పడేశావ్!"

అబ్బ! ఇంక వినలేక పోయాను. 'పాపం, ఆ నాంచారమ్మ, నారాయణులు ఏం పాపం చేసుకున్నారో! వాళ్లని కాల్చుకు తింటూంది. ఈవిడ ఉన్న నాళ్ళూ ఆవిడికి సుఖం లేదు. . .' అనుకొంటూ ఇంటికి తాళం వేసి ఆఫీసుకి బయలుదేరాను.

కాలం గడిచిపోతూంది. రెండు సంవత్సరాలు గిర్రున తిరిగాయి. . . నాంచారమ్మకు ఇంకోకొడుకు పుట్టాడు. ఎన్ని మారినా రవణమ్మగారి మనసు మాత్రం మారలేదు. మనిషికూడా బాగా ముసిలిది అయిపోయింది. మంచం కూడా పట్టింది.

• * *

ఆ రోజు నేను ఆఫీసునుండి వచ్చేటప్పటికి బాగా చీకటి పడింది. పక్కింట్లోనుండి ఏడుపు వినిపిస్తూంది. ఏమిటా అని ఆరా తీస్తే రవణమ్మగారు మధ్యాహ్నం పోయారని తెలిసింది. పోనీలే, ఇప్పుడేనా వాళ్ళు సుఖపడతారు అనుకొని అలిసి పోయి వచ్చానేమో పడుకొన్నాను. నిద్ర పట్టేసింది.

• • •

ఉదయం లేచేటప్పటికి ఆరు గంట అయింది. రోజూ వినిపించే రవణమ్మగారి మాటలు వినిపించక ఏదోలా ఉంది. . . ఎలాగా సెలవు కదా అని స్నానం చేసి నాంచారమ్మని చూసివద్దామని బయలుదేరాను.

నేను వెళ్ళేటప్పటికి రవణమ్మగారి పెట్టె తాళం తీసి దస్తావేజులు ఆపీ తీస్తున్నారు. నేనుకూడా వెళ్లి అక్కడ కూర్చున్నాను. కాగితాలు అన్నీ ఒక్కొక్కటీ తీస్తున్నాను.

ఆ కాగితాల మధ్య నుండి ఒక కవరు కింద పడింది. అది అక్కడ ఉన్న కరణంగారు తీసి దానిలో రాసింది ఇలా చదవసాగారు:

"చిరంజీవి నారాయణకి,

అమ్మ ఆశీర్వదించి వ్రాయునది.

నేను మీ ఇద్దరిపట్ల ఇప్పటివరకూ క్రూరంగా ప్రవర్తించినందుకు నాపై మీకు అసహ్యం పేరుకొని ఉంటుంది. చిన్నప్పటినుండి నా నోరే అంత. ఎంత ఆపుకోవాలన్నా ఆగేది కాదు. అది నా ఖర్మం. దత్తత వచ్చినవాళ్ళు సరిగా ఉండరని అంటూంటారు. అందుకే నేను నిన్ను ప్రేమగా చూడనట్లు నటించేదాన్ని. నన్ను లోకువ కట్టేసి నీ ఇష్టం వచ్చినట్లు చెడు తిరుగుళ్ళు తిరుగుతావనే ఉద్దేశంతో నిన్ను చిన్నప్పటినుండీ సాధించేదాన్ని. నా కృషి ఫలించింది. నాన్న మనల్ని వదిలి పోయేటప్పటికి నాలుగు ఎకరాల పొలం ఉండేది. అది ఇప్పుడు పదిహేడు ఎకరాలు అయింది. అదంతా కోడలు నాంచారమ్మ పేర దస్తావేజు వ్రాశాను. మీ ఇద్దరూ చిరకాలం ప్రేమతో ఉండాలని అలా చేశాను. ఇంక మీకు నా అదుపాజ్ఞలు లేవు. మీ ఇద్దరూ చిలకాగోరింకల్లా కాపరం చేయండి.

పాతవన్నీ మరిచిపోయి నీ హృదయంలో నాకు పవిత్రమైన స్థానాన్ని ఏర్పరిచి రెండు కన్నీటిబొట్లు రాలిస్తే చాలు. నా కంతకన్నా ఏమీ అక్కర లేదు.

ఇట్లు

—ఆశీస్సులతో అమ్మ."

ఉత్తరం పూర్తిఅయ్యే టప్పటికి నారాయణ, నాంచారమ్మలకు కళ్లమ్మట నీళ్ళు కారుతున్నాయి. ఒకసారి ఇద్దరూ గొల్లున ఏడ్చారు.

'పాపం! రవణమ్మగారు వాళ్లని ఎంత బాధపెట్టినా అన్నీ వాళ్ల సుఖం కోసమే చేసింది. ఆవిడ సుఖపడకుండా వీళ్ళు సుఖపడాలనే కలలు కంటూండేది. వీళ్లెప్పుడో పుణ్యం చేసుకున్నారు' అనుకుంటూ కళ్లనీళ్లు తుడుచుకొని బయలుదేరాను. ★



వెక్కిరింపు ఫోటో— పి.ఎమ్. వరప్రసాదరావు